క్లుప్తంగా

మహిళా ప్రయాణికులకు సన్మానం

నర్సాపూర్‌లో ఆర్టీసీ సంబురాలు



ప్రయాణికులను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

నర్సాపూర్: ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని డిపో ఇన్‌చార్జి మేనేజర్ సురేఖ చెప్పారు. బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో పలువురు మహిళ ప్రయాణికులను సన్మానించారు. వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందచేశారు. సన్మాన కార్యక్రమంలో ఎస్‌ఐ జగన్నాథం, అసిస్టెంట్ డిపో మేనేజర్ వీరబాబు, కంట్రోలర్లు శ్రీనివాస్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిరాములు సేవలు శ్లాఘనీయం

డీఈఓ రాధాకిషన్



ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న డీఈవో

మెదక్‌జోన్: విధి నిర్వహణలో చేసిన ఉపాధ్యాయులు చేసిన సేవలు ప్రజలు, విద్యార్థులు ఎప్పటికీ మరిచిపోరని డీఈఓ రాధాకిషన్ అన్నారు. చిలిప్‌చేడ్ మండలం చండూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన పట్లూరి సిద్ధిరాములు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు చేసిన సేవలు ఉపాధ్యాయులకు గుర్తింపు ఇస్తాయన్నారు. భవిష్యత్‌లో కూడా వారి జీవితాన్ని దేశం, విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ సుదర్శన మూర్తి, డీఎస్‌ఓ రాజిరెడ్డి, హవేళి ఘనపూర్ మండల విద్యాధికారి మధుమోహన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు యాదగిరి, ప్రణీత్, చల్లా లక్ష్మణ్, వెంకటరామిరెడ్డి, పద్మారావు, సుంకరి కృష్ణ, ఐలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన రీజినల్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం

తూప్రాన్: పట్టణంలో రీజినల్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నికలు బుధవారం నిర్వహించారు. ఈ ఎన్నికలు డాక్టర్ రెవ సాల్మన్ రాజ్, కడిమే మోజస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా పాస్టర్ ఎం.తిమోతి, వైస్ ప్రెసిడెంట్‌గా పాస్టర్ ప్రసాద్, కార్యదర్శిగా పాస్టర్ జీవరత్నం, ట్రెజరర్‌గా పాస్టర్ శాలెం రాజు, జాయింట్ కార్యదర్శిగా పాస్టర్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు పాస్టర్ పిట్ట న్యూటన్ మోజెస్ అభినందనలు తెలిపారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు

కొల్చారం(నర్సాపూర్): భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండలంలోని చిన్నఘనాపూర్ శివారులోని ఐఎంఎల్ డిపో ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘం అనుబంధ సంస్థ అయిన టీజీబీసీఎల్ ఐఎంఎల్ డిపో హమాలీ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆ సంఘం కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ కనీస వేతనాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. కార్మిక రంగానికి సంబంధించిన మొత్తం 62 జీవోలను వెంటనే సవరించాలని టీజీబీసీఎల్ ఐఎంఎల్ డిపో హమాలీ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నర్సింలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ఫూల్ సింగ్, దుర్గాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టార్పాలియన్లు అందజేత

హవేళిఘణాపూర్(మెదక్): ఇటీవల కురిసిన వర్షాలతో నివాస గుడిసెలు కూలిపోయి రోడ్డున పడిన కుటుంబాలకు లీలా గ్రూప్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో కొచ్చెరు తండాలో టార్పాలియన్లను అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరశురామ్, శ్రీకాంత్, రాంచందర్‌రావు తదితరులు ఉన్నారు.

పశువైద్యం.. కడు దైన్యం

అందుబాటులోని లేని మందులు

- ఏడాదిగా నిలిచిన సరఫరా
- ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయిస్తున్న పశు పోషకులు



రామాయంపేటలో గేదెకు చికిత్స చేస్తున్న వెటర్నరీ ఏడీ తిరుపతి

జిల్లా వివరాలు	
తెల్ల జాతి పశువులు	48,909
గేదెలు	1,03,615
మేకలు	1,49,128
గొర్రెలు	4,45,576
పశు వైద్యశాలలు	29
సబ్ సెంటర్లు	35
ఏడీ స్థాయి ఆస్పత్రులు	3

రామాయంపేట(మెదక్): జిల్లాలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. వానాకాలం సీజన్‌లో పశువులతో పాటు గొర్రెలు, మేకలకు వ్యాధులు సంక్రమిస్తుండగా, పశు వైద్యశాలల్లో మందులు కరువయ్యాయి. వైద్యుల సూచన మేరకు ప్రైవేట్ దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో పశు పోషకులపై ఆర్థిక భారం పడుతుంది. సాధారణ జబ్బులకు సైతం మందులు అందుబాటులో లేకపోవడం ఇబ్బందిగా మారింది. గతేడాది నుంచి ఈసమస్య ఉన్నా, ఇప్పటివరకు పరిష్కారం కాలేదు. జిల్లా పరిధిలో 67 పశు వైద్యశాలలుండగా, గతంలో ప్రతి మూడు నెలలకోసారి మందులు సరఫరా అయ్యేవి. గతేడాది కాలంగా సరఫరా నిలిచిపోయింది. జీవాలకు ఏదైనా రోగం వచ్చినా, ప్రమాదం జరిగి గాయపడినా పశు వైద్యశాలల్లో మందులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అధికారుల సమావేశంలో మందుల సరఫరా విషయమై ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. జిల్లా పరిధిలోని ఏ ఆస్పత్రికి ఎన్ని మందులు, వ్యాక్సిన్లు అవసరమో ఇండెంట్ పెట్టినట్లు అధికారులు తెలిపారు. అయితే జీవాలను పశు వైద్యశాలలకు తీసుకొస్తున్న రైతులు తమతో గొడవ పడుతున్నారని సిబ్బంది వాపోతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



పశు వైద్యశాలల్లో మందులు సరిగా లేవు. తాము జీవాలను తీసుకెళ్తే డాక్టర్లు మందులు బయటకు రాస్తున్నారు. దీంతో తమపై ఆర్థిక భారం పడుతోంది. అసలే ఇది వ్యాధుల సీజన్, ప్రభుత్వం వెంటనే స్పందించి మందులు సరఫరా చేయాలి.

– కంలియా నాయక్, దంతేపల్లి తండా, రామాయంపేట

త్వరలో మందుల సరఫరా



జిల్లాలోని పశు వైద్యశాలల్లో కొంతమేర మందుల కొరత నెలకొన్న విషయం వాస్తవమే. జిల్లాకు ఎన్ని మందులు అవసరమో ఇండెంట్ పెట్టాం. ఈవిషయమై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారం రోజుల్లో సరఫరా అయ్యే అవకాశం ఉంది.

– వెంకటయ్య, జిల్లా పశువైద్యాధికారి

పంచాయతీల ప్రగతి పట్టని ప్రభుత్వం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సునీతారెడ్డి ధ్వజం

మనోహరాబాద్(తూప్రాన్): కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పట్టించుకోవడం లేదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గౌతోజీగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరికృష్ణ, నాయకులు మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రంగౌడ్, మండల శాఖ అధ్యక్షుడు రమణగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



మెదక్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల బంద్ దృశ్యం

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి కార్తీక్

మెదక్ కలెక్టరేట్: రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ మెదక్ డివిజన్ కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త బంద్ విజయవంతమైనట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ కమిటీ పిలుపులో భాగంగా మెదక్‌లో విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యా వ్యవస్థలోని లోపాలను సరిచేయడానికి, విద్యార్థుల హక్కులను కాపాడటానికి ఈ బంద్ చేపట్టినట్లు తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించే చట్టాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తక్షణం విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ ప్రజా సంఘాల కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఓపెన్ స్కూల్’ ను సద్వినియోగం చేసుకోవాలి



కాళ్లకల్‌లో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి, ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): ఓపెన్ స్కూల్ విద్యను చదవడం, రాయడం వచ్చిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి పేర్కొన్నారు. మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓపెన్ స్కూల్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పదవ తరగతిలో అడ్మిషన్ కొరకు 14 సంవత్సరాల వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. ఇంటర్‌లో ప్రవేశానికి 15 సంవత్సరాల వయస్సు నిండిన పదవ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు హెచ్‌ఎం నరసింగం, పాఠశాల ఓపెన్ స్కూల్ సొసైటీ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ ఉమాదేవిని సంప్రదించాలని సూచించారు.

బడీడు పిల్లలను చేర్పించాలి



బడీడు పిల్లల వివరాలు సేకరిస్తున్న దృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని విద్యా పరిరక్షణ కమిటీ సెంట్రల్ యూనివర్సిటీ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. కూచారం పంచాయతీ పరిధిలోని దిల్లాయి ప్రాథమిక పాఠశాలను బుధవారం తెలంగాణ ప్రభుత్వం టీచర్స్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, కౌన్సిలర్ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో బడీడు పిల్లల వివరాలు సేకరించారు. 14 సంవత్సరాల వయసు లోపల ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేయడంతోపాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పిల్లల కోసం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా డీఈఓ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

లింగ వివక్షతపై అవగాహన అవసరం

నర్సాపూర్ రూరల్: లింగ వివక్షతపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జెండర్ సలహాదారు జమున అన్నారు. బుధవారం నర్సాపూర్ మండలం చిన్న చింతకుంటలో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో జెండర్ అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లోని సంఘాల నుంచి ఎన్నికైన జెండర్ పర్సన్ లింగ వివక్షపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో జెండర్ వేదిక ఏర్పాటు చేసుకొని ప్రతినెల సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, గ్రామ సర్పంచ్, అంగన్ వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, హెచ్‌ఎంలను ఆహ్వానించి సమావేశంలో బాధ్యుల ను చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జెండర్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ లింగయ్య గౌడ్, మహిళా శిశు సంక్షేమ శాఖ అదనపు అధికారి సరస్వతి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్, ఏపీఎం గౌరీశంకర్, సీసీ ప్రవీణ, చిన్నచింతకుంట మహిళా సంఘం అధ్యక్షురాలు సుమలత ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నగల వ్యాపారులకు డీఎస్పీ సూచన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్: పట్టణంలోని బంగారు నగల వ్యాపారులు, తయారీదారులకు డీఎస్పీ నరేందర్‌గౌడ్ బుధవారం తన కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇటీవల బంగారు దుకాణాల్లో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా దొంగతనానికి పాల్పడి నగలు విక్రయించేందుకు ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఐ శివానందం, నగల వ్యాపారులు, తయారీదారులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంటు ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం పెద్దతండాలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్వో వాటర్ ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి నీరజ్‌దుబే మాట్లాడుతూ స్వచ్ఛమైన నీటివాడకం లాభాలను వివరించారు. ఆర్వో ప్లాంటు నిర్వహణ ఆర్థిక అంశాలను గురించి తెలిపారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ గౌతం తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంటు ప్రారంభిస్తున్న సెహగల్ ప్రతినిధులు

మొక్కలను సిద్ధంగా ఉంచాలి

పెద్దశంకరంపేట(మెదక్): వనమహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ ఈజీఎస్ సిబ్బందికి, గ్రామకార్యదర్శులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, గ్రామకార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. మొక్కలు నాటడం, హార్టికల్చర్, సోంఫీట్, ఎస్‌బీయంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ జాకీర్ హుస్సేన్, ఏపీఓ సంతోష్ కుమార్, ఈసి నవాజుద్దీన్ తదితరులున్నారు.

యూరియాను పక్కదారి పట్టిస్తే వేటే

జిల్లాలో ఎరువుల దుకాణాలను వ్యవసాయ, పోలీసు అధికారులు బుధవారం విస్తృతంగా తనిఖీ చేశారు. యూరియా నిల్వల బోర్డును, రిజిస్టర్లను పరిశీలించారు. యూరియాను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు.

- జిల్లాలో ఎరువుల దుకాణాల విస్తృతంగా తనిఖీలు
- మెదక్‌లో ఆర్డీఓ తనిఖీ



మెదక్ మున్సిపాలిటీ: ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలించిన ఆర్డీఓ రమాదేవి



తూప్రాన్: తనిఖీ చేస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఎస్పీ నరేందర్‌గౌడ్



రామాయంపేటలో కోళ్ల దానా పరిశ్రమను పరిశీలిస్తున్న అధికారులు



శివ్వంపేటలో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపును ఆర్డీఓ రమాదేవి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. ఆర్డీఓ వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు : ఆర్డీఓ మైపాల్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలు, పీఏసీఎస్ కేంద్రంలో నర్సాపూర్ ఆర్డీఓ మైపాల్‌రెడ్డి పరిశీలించారు. నిబంధనల ప్రకారం రైతులకు మాత్రమే యూరియా అమ్మకాలు చేయాలని పక్కదారి పట్టకుండా వ్యాపారులు సహకరించాలని కోరారు. ఆయన కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, ఏఓ లావణ్య, ఆర్‌ఐ కిషన్, తదితరులు ఉన్నారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: తూప్రాన్‌లోని ఎరువుల దుకాణాలను ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఎస్పీ నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. అన్ని దుకాణాల్లో యూరియా నిల్వలు ఉన్నట్లు గుర్తించామన్నారు. తనిఖీల్లో సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ శివానందం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం హకీంపేట శివారులో గల జమున హ్యాచరీస్ పరిశ్రమలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. దానా తయారీలో వాడుతున్న పదార్థాల వివరాలన్నింటిని సంచులపై ముద్రించాలని, ఈ దానాలో వాడే పదార్థాల సమాచార పత్రాన్ని తప్పనిసరిగా కస్టమర్లకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఎస్సై రాజు, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, గిర్దావర్ ధన్‌సింగ్, ఏఈఓ రజిత, పంచాయితీ కార్యదర్శి ప్రణీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): కోళ్ల దాన పరిశ్రమను బుధవారం అధికారులు తనిఖీ చేశారు. స్థానిక తహసీల్దార్ రజనీకుమారి, ఎస్‌ఐ బాల్‌రాజు, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.

కోళ్లదాన పరిశ్రమల తనిఖీలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లిలోని శ్రీలక్ష్మి పౌల్ట్రీఫాం పరిధిలోగల కోళ్ల దాన పరిశ్రమను, ఎరువుల దుకాణాలను అధికారులు తనిఖీ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఏఓ శ్వేత కుమారి,ఎ స్‌ఐ మహమ్మద్ గౌస్, ఆర్‌ఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని పలు కోళ్ల ఫారంలను వ్యవసాయాధికారి నాగమాధురి తనిఖీ చేశారు. దానా సంచులపై, అందులో వాడే పదార్థాల వివరాలను ముద్రించాలన్నారు.కార్యక్రమంలో ఏఎస్‌ఐ తుక్కయ్య పాల్గొన్నారు.

నార్లాపూర్‌లో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామశివారులో ఉన్న కోళ్ల దాన పరిశ్రమలో మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, ఎస్‌ఐ రాజేశ్ తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా యూరియాను బ్లాక్ చేస్తే తమ దృష్టికి తీసుకరావాలని వ్యవసాయ అధికారి సూచించారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): గ్రోమోర్, ధనలక్ష్మి, జగదాంబ, పీఏసీఎస్ తదితర ఎరువుల దుకాణాలను ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, వినీత్, అఖిల్, ఫర్టిలైజర్ యజమానులు తదితరులున్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యవసాయాధికారి స్వప్న, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డితో కలసి మండలంలోని నాగ్సాన్‌పల్లిలోని బ్రీడింగ్ ఫామ్ పరిశ్రమలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం కౌడిపల్లిలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి, స్టాక్ రికార్డులు పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

◆ **స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి**

రామాయంపేట/నిజాంపేట(మెదక్): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు అన్నారు. బుధవారం రామాయంపేట, నిజాంపేటలో కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తీగల శ్రీనివాస్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు అవినాశ్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. అలాగే.. నిజాంపేట మండల కేంద్రాల్లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి నరేశ్, ఉపాధ్యక్షులు సిద్దరాంరెడ్డి, స్వామిగౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

◆ **ఈ-పంచాయతీ ఆపరేటర్ల వేతనాలు చెల్లించాలి**

పెద్దశంకరంపేట(మెదక్): ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మండల ఈ-పంచాయతీ కంప్యూటర్ల సంఘం అధ్వర్యంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీకి వినతిపత్రం అందజేశారు. ఇచ్చే వేతనంలో కూడా తగ్గించి ఇవ్వడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమను రెగ్యులరైజ్ చేస్తూ, సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ జాకీర్ హుస్సేన్, దాదిగారి సురేష్, నందు, భవానీప్రసాద్, రమేష్ తదితరులున్నారు.

◆ **టీచర్ల సమస్యలు పరిష్కరించాలి**

రామాయంపేట(మెదక్): ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సంఘం సభ్యులు తహసీల్దార్ రజనీకుమారికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం తమ సమస్యలు సాధించే వరకు విశ్రమించబోమని టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు రమేశ్ అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కౌన్సిలర్ రజిత, మండల ఉపాధ్యక్షుడు గోపాల్, అడిట్ కమిటీ సభ్యులు రమేశ్, నాగచందర్, భాసకర్, సత్యవతి, అంజయ్య పాల్గొన్నారు.

◆ **కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి**

నర్సాపూర్ రూరల్: స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికులా కష్టపడి పనిచేయాలని బీజేపీ ఓబీసీ ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం నర్సాపూర్ మండలం లింగాపూర్‌లో స్థానిక సంస్థ ఎన్నికల కార్యాచరణపై ఆ పార్టీ మండల అధ్యక్షుడు నగేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో ఎస్సీ మోర్చా నాయకుడు రాములు నాయక్, రామ్ రెడ్డి, బూతు అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

◆ **ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధ్యాయులు అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని చిలప్‌చెడ్ మండల యూఎస్‌పీసీ నాయకులు అన్నారు. బుధవారం తహసీల్దార్ సహదేవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకాల క్యాడర్ల వారికి బదిలీలు, పదోన్నతులు ఇవ్వాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయడంతో పాటు, కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు డీఈఓ పోస్టులను మంజూరు చేయాలన్నారు. పీఆర్సీతో పాటు, రిటైర్డ్ అయిన వారికి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు.

◆ **భూములు అడిగితే రైతులు తిరగబడుతారు**

నర్సాపూర్: ట్రిపుల్‌ఆర్ పక్కనే రైల్వేలైను ఏర్పాటు చేసేందుకు భూములు కావాలని అడిగితే రైతులు తిరగబడతారని మహిళా కాంగ్రెస్ నాయకురాలు, చిప్పల్‌తుర్తి మాజీ ఎంపీటీసీ సంధ్యారాణి హెచ్చరించారు. బుధవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. మండలంలోని రెడ్డిపల్లి, మహ్మదాబాద్, ఖాజీపేట, మూసాపేట, చింతకుంట తదితర గ్రామాల మీదుగా ఇప్పటికే కాళేశ్వరం కాలువ, ట్రిపుల్‌ఆర్ రోడ్డు కోసం రైతుల నుంచి ప్రభుత్వం భూములు సేకరించిందని చెప్పారు. భూములకు ఓపెన్ మార్కెట్‌లో ఎకరానికి రూ.80లక్షల నుంచి రూ.కోటి పలుకుతుండగా ప్రభుత్వం 10 నుంచి రూ.15లక్షలు ఇవ్వడంతో రైతులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ **బాలకార్మికులతో పనులు చేయిస్తే చర్యలు**

హవేళిఘణాపూర్(మెదక్): బడీడు పిల్లలను ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్‌రూరల్ ఎస్‌ఐ మురళి తెలిపారు. బుధవారం మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్‌లోని ఓ రైస్‌మిల్లు ఒకరు, కల్లు దుకాణంలో ఇద్దరు మైనర్లతో పనులు చేయిస్తున్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేశామన్నారు. బాల కార్మికుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు తెలిపారు.